
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి ములుగు
5
సోమవారం 30 సెప్టెంబరు 2024





మిల్లర్లకు ముకుతాడు!

మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను రూపొందించింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా దారి మళ్లించడం, నాణ్యమైన బియ్యం ప్రైవేటుగా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇటీవల పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో నిబంధనల అమలు విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విధివిధానాలను ప్రభుత్వం కఠినతరం చేసింది. ఇంతకు ముందులాగా ఇష్టానుసారంగా ధాన్యాన్ని మిల్లర్లకు ఇవ్వడానికి వీలులేకుండా నిబంధనల్లో మార్పులు చేర్పులు చేసింది. ముఖ్యంగా డిఫాల్టర్లయిన మిల్లర్లకు ధాన్యం కేటాయించరాదని నిబందనల్లో పేర్కొన్నది. ఎలాంటి పూచీకత్తు లేకుండా ధాన్యం కేటాయించవద్దని పౌరసరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి చౌహాన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

- సీఎంఆర్ నిబంధనలు ఇక కఠినతరం
- ఇష్టానుసారంగా ధాన్యం కేటాయింపులు ఉండవు
- 25 శాతం బ్యాంకు గ్యారెంటీ తప్పనిసరి
- బ్లాక్ లిస్టుల్లో డిఫాల్ట్ అయిన మిల్లర్లు
- నోడ్యూస్ సర్టిఫికెట్ సమర్పిస్తేనే ధాన్యం
- కలెక్టర్లకు సీఎంఆర్ పర్యవేక్షణ బాధ్యత
- జారీ అయిన కొత్త మార్గదర్శకాలు

హనుమకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు మిల్లర్లు సీఎంఆర్‌ను పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి బాకీ పడిన బియ్యాన్ని ఇవ్వకుండా వారి పరపతితో తప్పించుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రభు త్వం మారడంతో పౌరసరఫరాల శాఖలో లొసుగులను వెలికితీస్తోంది. గత ప్రభుత్వం హయాంలో బాకీపడిన సీఎంఆర్ మొత్తాన్ని వసూలు చేయడానికి అధికా రులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23వ వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి దిగుబడి అయిన బియ్యాన్ని మిల్లింగ్ కోసం మిల్లర్లకు కేటాయించగా ఇందులో వానాకాలం సీజన్‌కు సంబంధించి 94 శాతం వరకు బియ్యం రాగా, యాసంగి సీజన్‌లో మిల్లింగ్ 24 శాతం పూర్తయింది. మిల్లర్ల నుంచి పెద్ద మొత్తంలో బియ్యం రావలసి ఉంది. వాటి కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు నాలుగు సార్లు గడువు పొడిగించింది. అయినా స్పందనలేకపోవడంతో కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాలోని రైస్ మిల్లులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఇందులో కొందరు మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని ప్రభు త్వానికి ఇవ్వకుండా దారి మళ్లించినట్టు వెల్లడవుతోంది. దీంతో అక్రమాలకు పాల్పడిన మిల్లలను సీజ్ చేసి మిల్లర్లపై కేసులు నమోదు చేస్తున్నారు. కొందరు మిల్లర్ల ఆస్తులను కూడా జప్తు చేసి వేలం కూడా వేస్తున్నారు.

కొత్త నిబంధనలు

మిల్లర్లు బాకీ పడిన మొత్తానికి 25 శాతం అదనంగా కలిపి ప్రభుత్వానికి బియ్యం అందజేయాలి. లేకపోతే క్రిమినల్ కేసులతో పాటు ఆర్‌ఆర్ చట్టాన్ని ప్రయోగించనున్నారు. డీఫాల్టర్లకు సీఎంఆర్ కేటాయించడాన్ని ప్రభుత్వం తప్పుపడుతోంది. నూటికి నూరు శాతం సీఎంఆర్ ఇచ్చిన వారికి ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం ఇవ్వాలని సూచించింది. రెండేళ్ల నుంచి మొదటి సారి డీఫాల్టర్ అయిన మిల్లర్లకు ధాన్యం కేటాయించొచ్చని పేర్కొన్నది. ఒకటి కంటే ఎక్కువసార్లు డీఫాల్టర్ అయిన మిల్లర్లు బకాయిలతో పాటు అదనంగా 25శాతం జరిమానాతో మొత్తం 125శాతం బియ్యాన్ని ఇస్తూ బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలి. మిల్లింగ్ కోసం ధాన్యం తీసుకునే మిల్లర్లు ధాన్యం విలువకు అనుగుణంగానే బ్యాంక్ గ్యారెంటీ తప్పనిసరి అని.. దీని వల్ల మిల్లర్లు అక్రమంగా బియ్యం అమ్ముకోవడం తగ్గుతుందని ప్రభుత్వం భావి స్తోంది. ఇందుకు అనుగుణంగా నిబంధనలు సవరించింది. కేటాయించిన ధాన్యం మిల్లింగ్ కేపాసిటీని బట్టి మిల్లింగ్‌కు వచ్చే 15 రోజుల ముందే 25 శాతం బ్యాంకు గ్యారెంటీని సమర్పించాల్సి ఉంటుంది. లీజు



మిల్లుదారుడైతే ధాన్యంలో 50 శాతం బ్యాంకు గ్యారెంటీ సమర్పించాల్సి ఉంటుంది. లీజు తీసుకున్న మిల్లులో గతంలో యజమాని సీఎంఆర్ డెలివరీ పెండింగ్ లేనట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ల (డీఎం) నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకోవలసి ఉంటుంది. ఈ మేరకు అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే మిల్లులకు కేటాయింపులు ఉంటాయి.

అంతేకాకుండా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నుంచి ఇద్దరు మిల్లర్ల ద్వారా హామీ పత్రం అందజేయాల్సి ఉంటుంది. రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలులో ఉన్న మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు ఉండవని మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడినట్టు తేలిన మిల్లర్లకు, నకిలీ ట్రక్ షీట్లు సృష్టించిన కేసుల్లో ఇరుకున్నవారికి, 6ఏ ఈసీ యాక్ట్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారికి ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యం కేటాయించకూడదని, వీరికి ఈ సీజన్‌తో పాటు వచ్చే రెండు సీజన్ల వరకు వడ్లు ఇచ్చే ప్రసక్తే లేదని తెలుస్తోంది. డీఫాల్ట్ అయిన మిల్లర్లు బకాయిపడ్డ సీఎం ఆర్‌ను అప్పగించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకుంటేనే కొత్తగా ధాన్యం కేటాయించనున్నారు. మిల్లర్లు లీజు డీడ్ ఇవ్వడంతో పాటు

మిగతా 7వ పేజీలో..

కొత్త పాలసీ ప్రకటిస్తేనే మిల్లింగ్

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు సన్నరకాల వరి ధాన్యమే భారీ రానున్నట్టు అంచనాల నేపథ్యంలో కొత్త పాలసీ ప్రకటిస్తే తప్ప ధాన్యాన్ని మిల్లింగ్ చేయబోమని మిల్లర్లు ప్రభుత్వానికి తేల్చిచెబుతున్నారు. ఈ మేరకు ములుగుతో పాటు మరి కొన్ని జిల్లాల రైస్ మిల్లర్ల సంఘాలు ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి నివేదించాయి. ప్రస్తుతం నిబంధనల ప్రకారం మిల్లర్లు క్వింటాలు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 67 కిలోల బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద అప్పగించాల్సి ఉంటుంది. అయితే దొడ్డురకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాలుకు సగటున 67 నుంచి 68 కిలోల బియ్యం వస్తుంది. సన్నరకాలకు సంబంధించి మాత్రం కొనుగోలు కేంద్రాల్లో 17 శాతం తేమతో ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి మిల్లింగ్ చేస్తే సగటున 67 కిలోల బియాన్ని సీఎంఆర్ కింద అప్పగించాలంటే క్వింటాలుకు 8 కిలోల వరకు నష్టం వస్తుందని, కనుక కొత్త పాలసీ ప్రకటిస్తే తప్ప ఈ సీజన్‌లో మిల్లింగ్ చేసే అవకాశం లేదని పేర్కొంటున్నారు.

'మేడిగడ్డ'కు 2.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 29 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం బ్యారేజీలోకి 2.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 3.80 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 29: సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు హాజరుకావాలని ఆయన సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాటారం, సెప్టెంబరు 29: కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భిక్షపతి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లో ఐదో విడత వాక్-ఇన్ అడ్మిషన్ల కోసం సోమవారం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డీఎం సివిల్-24, కోపా విభాగంలో 15 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇష్టారాజ్యం!

- అస్తవ్యస్తంగా ఐటీడీఏ పరిపాలన విభాగం
- రెండు నెలల్లోనే డిప్యూటేషన్‌పై వెళ్లిన ఏవో
- అనారోగ్యంతో సరిగా విధులకు హాజరు కాని ఏపీవో
- అవస్థలు పడుతున్న గిరిజనులు



ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 29: గిరిజనుల అభ్యున్నతి కోసం పనిచేయాల్సిన ఐటీడీఏలో నిర్లక్ష్యం పెచ్చుమీరుతోంది. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆయా శాఖల పనితీరుపై నిరంతరం పర్యవేక్షించడంలో ప్రధాన పాత్రపోషించాల్సిన పరిపాలన విభాగం గాడితప్పిందని తెలుస్తోంది. ఉన్నతాధికారులు బదిలీపై వెళ్లడం వారి స్థానంలో ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన వారు అయిష్టత కనబర్చడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్(పీవో) తర్వాత ప్రధాన పోస్టులైన అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఏపీవో), పరిపాలన అధికారి (ఏవో) వంటి అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. పీవో అందుబాటులో లేని సమయంలో తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చే గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినా తమకు పడిగాపులు తప్పడం లేదని, సమస్యలను ఆలకించే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల్లోనే డిప్యూటేషన్

ఐటీడీఏ పరిపాలన అధికారి (ఏవో) డిప్యూటేషన్ వెళ్లడం చర్చనీయాశంగా మారింది. రెండు నెలల క్రితం ఉట్నూర్ ఐటీడీఏ నుంచి ఏటూరునాగారం ఏవోగా పున్నం రాంబాబు ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న దామోదర స్వామి ఉట్నూర్ ఐటీడీఏకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన రాంబాబు రెండు నెలలపాటు ఇక్కడే విధులు నిర్వర్తించారు. ఇక్కడ ఐటీడీఏ వాతావరణ పరిస్థితులు నచ్చకపోవడంతో పనిచేసేందుకు అయిష్టత కనబరుస్తూ భద్రాచలం ఐటీడీఏ ఏవోగా డిప్యూటేషన్‌పై వెళ్లారు. తన స్వస్థలం కూడా భద్రాచలం కావడం, అక్కడి ఏవో అనారోగ్య కారణాలతో మరణించడంతో ఆయన స్థానంలో రాంబాబు డిప్యూటేషన్‌కు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఏవో డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఐటీడీఏ ప్రధాన పనులన్నీ ఆగిపోతున్నాయి. అంతేకాకుండా ఐటీడీఏ ఏపీవో భీంరావు అనారోగ్యంతో బాధపడుతూ విధులకు సరిగా హాజరు కావడం లేదు. ఐటీడీఏలో ఉన్నతాధికారుల బదిలీలు ప్రస్తుతం గిరిజనులకు శాపంగా మారాయి. ఇక్కడ పనిచేస్తున్న ఏపీవో వసంతరావును ఉట్నూర్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో భీంరావును నియమించారు. కానీ భీంరావు అనారోగ్య కారణాల దృష్ట్యా పరిపాలనపై దృష్టి పెట్టకపోవడంతో గిరిజనులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పీవో అందుబాటులో లేని సమయంలో ఏపీవోనే ఐటీడీఏ పాలనను పర్యవేక్షించాల్సి ఉండగా ఇప్పుడు ఆ పరిస్థితులు లేకుండా పోయాయి.

ముందుకు సాగని పనులు... అవస్థలు పడుతున్న గిరిజనులు

ఐటీడీఏలో ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఏపీవో, ఏవో వంటి ఉన్నతాధికారులే లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. పీవో లేని సమయంలో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు ప్రస్తుతం ఐటీడీఏలో నెలకొన్నాయి. ఐటీడీఏ పాలనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, ఏపీవో, ఏవో వంటి ఉన్నతాధికారులు ఐటీడీఏ ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి. పరిపాలన విభాగమే అస్తవ్యస్తంగా మారడంతో ఇతర శాఖల అధికారుల పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతోంది.

క్రమశిక్షణతో చదివితేనే బంగారు భవిష్యత్తు

- డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా రామ్‌కిషన్



ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవంలో రామ్‌కిషన్

చిట్యాల, సెప్టెంబరు 29: క్రమశిక్షణతో కష్టపడి చదివిన వారికే బంగారు భవిష్యత్తు ఉంటుందని డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా అజ్మీరా రామ్‌కిషన్ అన్నారు. ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మండలంలోని జూకల్లు ప్రభుత్వ పాఠశాలలో టీఎస్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా అవార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో బంజారా కుటుంబంలో పుట్టి, దేశంలో ఉన్నత ఉద్యోగం చేస్తున్నానంటే అది కేవలం చదువుతోనే సాధ్యమైందన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, కఠోర దీక్ష, అంకిత భావంతో చదవాలన్నారు. తన తండ్రి సమ్మయ్య జ్ఞాపకార్థం ప్రతిభా అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన అనేక మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయుల బదిలీల్లో మండలానికి వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, సూదం సాంబమూర్తి, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరెడ్డి, ఊర్మిళ, గిరగాని కృష్ణ, సుమలత, ఉపాధ్యాయులు లింగయ్య, పావని, సదానందం, విజయశాంతి, ప్రసాద్, భగవాన్‌రెడ్డి, రవీందర్, విజయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే!

- జాతీయ రహదారిపై బ్రిడ్జికి భారీ గండి

ఏటూరునాగారం, సెప్టెంబరు 29: ఏటూరునాగారం మండలంలోని 163 జాతీయ రహదారిపై నిర్మించిన మూడో వారధి వద్ద భారీ గండి పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, గోదావరి, జంపన్నవాగు వరదలకు మూడో బ్రిడ్జికి ఆసరాగా నిర్మించిన అప్రోచ్ రోడ్డు వద్ద కోతకు గురైంది. ఇది వాహ దారులకు పెను ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి మీదుగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహా రాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి చిన్న, భారీ, అతి భారీ యంత్రాలను తీసుకెళ్లే పెద్ద కంటెయినర్లు, లారీలు నిత్యం తిరుగుతుంటాయి.



జాతీయ రహదారి వంతెన వద్ద భారీగా ఏర్పడిన గండి

అయితే.. వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లో జలపాతాలను తిలకించేందుకు సెలవు రోజుల్లో ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఈ రోడ్డున ప్రయాణిస్తుంటారు. ఈ దారి దుస్థితిని గమనించని వారికి ఇది ప్రమాదకరంగా మారింది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఇదే ప్రదేశంలో గండి ఏర్పడింది. దీంతో తాత్కాలికంగా మట్టితో పూడ్చిన కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత ఇంజనీరింగ్, ఎన్‌హెచ్ హైవే అధికారులు పట్టించుకోలేదని, శాశ్వత పనులు చేయకుండా నిధులు దుర్వినియోగం చేసినా ఉపేక్షించారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి పూర్తిగా కొట్టుకుపోయి మళ్లీ గండి ఏర్పడటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే ఈ రహదారిపై ప్రమాదం పొంచి ఉన్న దృష్ట్యా అటువైపు ప్రయాణించే వారు జాగ్రత్తగా వెళ్లాలని సూచిస్తున్నారు.



రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రామప్పలో భక్తుల సందడి

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 29: మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు తరలివచ్చారు. అమెరికా దేశస్థుడు డేవిడ్ సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవాలయ శిల్పకళా సంపదను వీక్షించి ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు.



గోదావరి ఒడ్డున భక్తుల సందడి

గోదావరి తీరాన కోలాహలం

మహదేవపూర్, సెప్టెంబరు 29 : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర సంగమం గోదావరి తీరం ఆదివారం సందడిగా మారింది. పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులతో కోలాహలంగా నెలకొంది. పితృ పక్షాల సందర్భంగా పెద్దలకు బియ్యం ఇచ్చుకోవడం, గోదావరి తీరంలో ఇవ్వడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గోదావరి వద్ద భక్తులు పోటెత్తారు. పుణ్యస్నానాలు అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

మంత్రి ఉత్తమ్ తండ్రికి సీతక్క నివాళి

ములుగు, సెప్టెంబరు 29: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి మరణించగా ఆదివారం హైదరాబాద్‌లో ఆయన భౌతికకాయానికి మంత్రి సీతక్క నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీహెచ్‌ఈఎల్‌లో పనిచేసే క్రమంలో అనేక మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన గొప్ప వ్యక్తి పురుషోత్తంరెడ్డి అని మంత్రి సీతక్క కొనియాడారు. సిమెంట్ ఉత్పత్తి రంగంలో ఆయన కీలకంగా వ్యవహరించారని తెలిపారు.

పాండవుల గుట్టల అభివృద్ధికి కృషి


- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



రాక్‌క్లైంబింగ్ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

రేగొండ, సెప్టెంబరు 29: పర్యాటకులను ఆకర్షించేలా పాండవుల గుట్టల్లో అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తామని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మండల పరిధి రావులపల్లి శివారులోని పాండవుల గుట్టలను ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి కలెక్టర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ట్రెక్కింగ్ తోపాటు రాక్‌క్లైంబింగ్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాండవుల గుట్టలు అద్భుతమైన పర్యాటక ప్రాంతమన్నారు. ఇక్కడ పర్యాటకులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రోడ్లు, పార్కింగ్ స్థలాలు, రీసార్ట్స్, బస చేసేందుకు కాటేజీలు నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రం నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేలా అభివృద్ధి జరిగితే ఈ ప్రాంతంలో యువకులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఇక్కడి రాతి చిత్రాలు, ఆకృతులను రక్షించేలా చర్యలు చేపడతామన్నారు. పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చేలా ప్రత్యేక ప్యాకేజీలు రూపొందిస్తామన్నారు. గైడ్ సేవలు, ట్రెక్కింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై ప్రణాళికలు తయారు చేశామన్నారు. ఆయన వెంట డీపీఆర్వో శ్రీనివాస్, ఆర్డీవో మంగిలాల్, డీఎస్పీ సంపత్‌రావు ఉన్నారు.

DEVARA THANDAVAM



MASS JATHARA



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేలేరు, సెప్టెంబరు 29: చెట్టుపై నుంచిపడ్డ సూత్రపు కనుకయ్య (60) అనే వృద్ధుడు మృతి చెందినట్టు ఎస్సై సురేష్ ఆదివారం తెలిపారు. వేలేరు మండల కేంద్రానికి చెందిన కనుకయ్య ఈనెల 15న గ్రామంలో వినాయకుడికి పూజ కోసం పూలను కోసేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. చెట్టు ఎక్కి పూలను కోస్తుండగా కాలుజారి చెట్టుపై నుంచి కనుకయ్య కిందపడిపోవడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

ధర్మసాగర్, సెప్టెంబరు 29: ఇటీవల ధర్మసాగర్ మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన ధార కనుకయ్య (60) కుటుంబాన్ని పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్, ప్రభుదేవ్, తరుణ్, రాకేష్, ఆగస్టిన్ పాల్గొన్నారు.



ట్రాఫిక్ అధికారులకు బాడీ వార్న్ కెమెరాలు అందిస్తున్న ఏసీపీ సత్యనారాయణ

ట్రాఫిక్ పోలీసులకు బాడీ వార్నింగ్ కెమెరాలు

- దాడుల నియంత్రణకు పోలీసుశాఖ నిర్ణయం
- ప్రతీ స్టేషన్‌కు మూడు చొప్పున కెమెరాలు అందజేత

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 29: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మందుబాబులను కట్టడి చేసేందుకు ట్రైసిటీ పరిధిలోని ట్రాఫిక్ పోలీసుల చేతుల్లోకి బాడీ వార్న్ కెమెరాలు వచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. మందుబాబులు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ హెచ్చరించారు. ట్రైసిటీ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో పాటు శాంతిభద్రతల పర్యవేక్షణ విధులు నిర్వహించే సమయంలో ప్రజల నుంచి ఎదురయ్యే సమస్యలు, దాడుల నియంత్రణ కోసం పోలీసుశాఖ ప్రధాన కార్యాలయం నుంచి బాడీ వార్న్ కెమెరాలు మంజూరైనట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు ఒక్కొక్క పోలీస్‌స్టేషన్‌కు మూడు బాడీ వార్న్ కెమెరాలను ఆదివారం ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులకు అందజేసినట్లు ఏసీపీ తెలిపారు. ఇకపై నగరంలో ట్రాఫిక్ పోలీసుల అధికారులు బాడీ వార్న్ కెమెరాలు ధరించి తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. తనిఖీల సమయంలో ఎవరైనా వాహనదారుడు పోలీసులపై దాడులకు పాల్పడిన, దూషించి విధులకు ఆటంకం కలిగించే ప్రవర్తించిన పోలీసు అధికారి యూనిఫామ్‌పై ఉన్న కెమెరా సంఘటనాస్థలంలో వాస్తవాలను చిత్రీకరిస్తుందన్నారు. ట్రాఫిక్ అధికారులు తనిఖీ సమయంలో పారదర్శంగా విధులు నిర్వర్తించేందుకు సైతం అనువుగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు షూకూర్, రామకృష్ణ, నాగబాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 29: భూపాలపల్లి జిల్లాలోని ముత్య కిడ్నీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు డాక్టర్ బచ్చు చందు క్రిష్ణ, డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ పాపయ్య నిర్మల్ పూదోట, డాక్టర్ సందీప్ మాచర్ల పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, క్రియాటిన్, సీబీపీ లాంటి రోగ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేశారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

సైన్స్ సెంటర్ దశ మారేనా?

- 9 ఏళ్లుగా అరకొర నిధులతోనే నిర్వహణ
- రూ. 4 కోట్లతో మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే నాయిని చొరవతో అభివృద్ధికి ముందడుగు
- జనవరి లోపు పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 : విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించేందుకు శాస్త్రీయ దృక్పథం, ఆలోచన విధానాలను పెంపొందించేందుకు వరంగల్‌లో ఏర్పాటు చేసిన రీజనల్ సైన్స్ సెంటర్ నిధుల లేమిలో కొట్టుమిట్టాడుతోంది. టీజీకాస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ సెంటర్‌కు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. సైన్స్ సెంటర్ నిర్వహణ, అభివృద్ధి కోసం సాలీన రూ. 60లక్షలు మంజూరు చేసి అందులో సగభాగం సైన్స్ సెంటర్ నిర్వహణకు, మరో సగం నిధులు అభివృద్ధి కోసం వెచ్చించే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేసింది. ప్రభుత్వం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు అందులో 10 శాతం నిధులను సైతం విదిలించలేదు. సైన్స్ ఉపకరణాలు పాడైపోతే వాటి సరి చేయించడం ఇబ్బందిగా మారుతోంది. దీంతో పదుల సంఖ్యలో ఉపకరణాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. 69 ఉపకరణాలు ఉండగా అందులో 20 వరకు పనిచేయకుండా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిర్వహణ, అభివృద్ధి నిధులు నిలిచిపోవడంతో పనిచేయని ఉపకరణాలను సరిచేసేందుకు నిధులు లేవు. సందర్శకుల నుంచి వసూలు చేస్తున్న రుసుముతోనే బొటాబొటి నిర్వహణ పనులు చేపడుతున్నారు. నిధుల లేమితో నిర్వహణ కష్టమవుతున్నట్లు కనిపిస్తోంది. సందర్శకులు తాకిడి తక్కువగానే ఉంటున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు ఆశించిన మేరకు సైన్స్ సెంటర్‌ను సందర్శించడం లేదు. ఆ మేరకు సంబంధిత విద్యాశాఖాధికారులు చర్యలు తీసుంటున్నట్లు కనిపించడం లేదు.

1999లో బీజం..

ఉన్నత లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు సైన్స్ కేంద్రాలను నెలకొల్పాలని ప్రతిపాదించి ఒకటి వరంగల్, మరొకటి విజయవాడలో నెలకొల్పేందుకు 1999లో భూమిపూజ చేశారు. వరంగల్‌లోని హంటర్ రోడ్డులో 14.3 ఎకరాల సువిశాల ఎత్తైన స్థలంలో దీని నిర్మాణం కోసం రూ. 5.68 కోట్లు వెచ్చించారు. 2015 అక్టోబర్ 21న అప్పటి ఉప ముఖ్యమంతి కడియం శ్రీహరి చేతుల మీదుగా రీజనల్ సైన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి(తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ - టీజీసీఎస్‌టీ (టీజీకాస్ట్)) ఆధ్వర్యంలో సైన్స్ సెంటర్ నడుస్తోంది. రూ.5కోట్లు భవన నిర్మాణం, ఇతరత్రా సౌకర్యాల కోసం ఖర్చు చేస్తే రూ.68లక్షలను సైన్స్ ఉపకరణాలను ఏర్పాటు చేసేందుకు వెచ్చించారు. ఇందులో 59 ఇండోర్ సైన్స్ ఉపకరణాలు ఉండగా 10 అవుట్‌డోర్ ఉపకరణాలు ఉన్నాయి. ఏటా రూ.60లక్షలను నిర్వహణ అభివృద్ధి కోసం సైన్స్ సెంటర్‌కు నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నప్పటికీ ఆ మేరకు నిధులు మంజూరు చేయకపోవడంతో సైన్స్ సెంటర్ నిర్వహణ భారమవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం రోజున రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ వాణీప్రసాద్ రీజనల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడి పరిస్థితులను గమనించిన ఆమె సెంటర్ మరమ్మతుల కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అప్పటి కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను ఆదేశించారు. దీంతో కుడా ఇంజనీర్ల బృందం సైన్స్ సెంటర్‌లో మరమ్మతులు, అభివృద్ధి పనుల కోసం రూ.4కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆ పనులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. ఇప్పటికైనా వరంగల్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌కు మహర్దశ పట్టనుంది.



సైన్స్ సెంటర్ ముఖద్వారం

పాక్షికంగా శిథిలావస్థకు భవన సముదాయం

సైన్స్ సెంటర్ భవనం పాక్షికంగా శిథిలమవుతోంది. బయట గోడలకు ఎలివేషన్‌గా అలంకరించిన టైల్స్ ముక్కలు రాలిపోతున్నాయి. ఇక లోపలి గోడలు పాడవుతున్నాయ. స్లాబ్ కురుస్తుండటంతో గోడలు తడిబారి అక్కడక్కడ పాడైపోయాయి. భవనానికి ఉన్న అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సైన్స్ సెంటర్‌లో 69 సైన్స్ ఉపకరణాలు ఉండగా అందులో 20పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. మరికొన్ని పాక్షికంగా పనిచేయడం లేదు. ఇకమూడు టెలిస్కోపులుండగా ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది.

ప్రతిపాదిత పనులు ఇవే..

కుడా ఇంజనీర్ల బృందం భవనానికి మరమ్మతులు, సైన్స్ సెంటర్ చుట్టూ ఉన్న పరిసరాల్లో ఉన్న పెద్ద పెద్ద రాళ్లపై శాస్త్రవేత్తల బొమ్మలు, సెంట్రల్ ఏసీ, సెంటర్ చుట్టూ గ్రీనరీ, ప్రహరి నిర్మాణంకోసం రూ.4కోట్లతో ప్రతిపానలు సిద్ధం చేశారు. ఆ తర్వాత కొత్తపరికరాల కోసం మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేసి కొత్త పరికాలు సమకూర్చేందుకు సైతం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ఎమ్మెల్యే నాయిని చొరవతో ముందడుగు

తన నియోజకవర్గంలోని రీజనల్ సైన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నారు. ఆయన చొరవతో సైన్స్ సెంటర్ అభివృద్ధి పనులకు ముందడుగులు పడుతున్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీకాస్ట్ మెంబర్ సెక్రెటరీ డాక్టర్ నుంకె రాజేంద్రప్రసాద్ తదితరులతో కలిసి కుడా ప్రతిపాదించిన రూ.4కోట్ల పనుల వివరాలను పర్యవేక్షించేందుకు సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఆదేశాలతో కదిలిన జిల్లా యంత్రాంగం కుడా ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టి జనవరిలోగా అవసరమైన వసతులను కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించే పనిలో పడ్డారు.

విడుదలైన నిధులు

- 2020 వరకు అంతంత మాత్రంగానే విడుదలైన నిధులు ఆ తర్వాత ఒక్క పైసా కూడా విడుదల కాలేదు.
- 2014-15లో రూ. 15,12000 ప్రతిపాదించి అంతే నిధులు విడుదల చేశారు.
- 2015-16లో రూ. 6 లక్షల రూపాయలు ప్రతిపాదించి రూ. 3 లక్షలు మాత్రమే మంజూరు చేశారు.
- 2016-17లో రూ. 6 లక్షల రూపాయలు ప్రతిపాదించి రూ. 3 లక్షలు మాత్రమే మంజూరు చేశారు.
- 2017-18లో రూ. 6 లక్షలు ప్రతిపాదించి రూ. 2.7 లక్షలు మంజూరు చేశారు.
- 2018-19లో రూ. 6 లక్షలు ప్రతిపాదించి రూ. 90 వేలు మంజూరు చేశారు.
- 2019-20లో రూ. 76 వేలు ప్రతిపాదించి రూ. 39 వేలు మంజూరు చేశారు.



పాక్షికంగా శిథిలమైన సైన్స్ సెంటర్ భవన సముదాయం



సైన్స్ సెంటర్‌లోని కొన్ని సైన్స్ ఉపకరణాలు

మిల్లర్లకు ముకుతాడు!

(5వ పేజీ తరువాయి)

కేటాయించిన ధాన్యానికి బ్యాంక్ గ్యారెంటీ తప్పని సరికానున్నది. రైస్ మిల్లులు తమకు కేటాయించిన ధాన్యాన్ని ఏడాదిన్నర వరకు కూడా మిల్లింగ్ పూర్తి చేయ కుండా తమ వద్దే నిల్వ ఉంచుకుం టున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. తద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడం, ఎఫ్‌సీఐ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలో ఆలస్యం చేయడం వంటి పరిణామా లు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మిల్లులు సీఎంఆర్ కోసం ప్రతీ రోజు రెండు షిఫ్టుల్లో 16 గంటలు పని చేయాలని మార్గదర్శకాల్లో పొందుపరిచారు. ముడిబియ్యం ఇచ్చే రారైస్ మిల్లులకు వడ్లు కేటాయిస్తే 8 గంటల చొప్పున రెండు షిప్టుల్లో రోజుకు 16 గంటలు మిల్లింగ్ చేసి 75 రోజుల్లో కేటాయించిన ధాన్యంలో 67 శాతం రారైస్ ఇవ్వాల్సి ఉంటుంది. మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యం కేటాయించనున్నారు.

కలెక్టర్లకు బాధ్యతలు

జిల్లాల వారీగా రైస్ మిల్లుల్లో సాగే సీఎంఆర్‌పై కలెక్టర్లకే బాధ్యతలు అప్పగించనున్నారు. ధాన్యం కొనుగోళ్ల నుంచి మిల్లింగ్ వరకు వారే కీలకం. బాయిల్డ్ రైస్ మిల్లర్లు ఫోర్టిఫైడ్ రైస్ ఇచ్చేందుకు డిసెంబర్ 31లోగా ఎఫ్ఆర్‌కే బ్లెండింగ్, సోరెక్స్ మెషిన్లు అమర్చుకునేలా ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకొని వారికే ధాన్యం కేటాయించాల్సి ఉంటుంది. జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి అర్హత ఉన్న మేరకే ధాన్యం కేటాయించాలి. మిల్లలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కేటాయించిన ధాన్యం దారిమళ్లినా, ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రైవేటుగా విక్రయించినా క్రిమినల్ చర్యలు తప్పనిసరి.



10 వ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులతో గౌడ సంఘం నాయకులు

గౌడ విద్యార్థులు విద్యలో రాణించాలి

గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయ్యన్న గౌడ్

న్యూశాయంపేట, సెప్టెంబరు 29: గౌడ విద్యార్థులు విద్యా రంగంలో రాణించాలని గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్ అన్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన 10 మంది గౌడ విద్యార్థులకు ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ గౌడ హాస్టల్‌లో ప్రశంసపత్రం, మెమొంటో, శాలువాతో సత్కరించి ఒక్కో విద్యార్థికి రూ.2000 నగదును సర్దార్ సర్వాయి పాపన్న, కౌండిన్య పరపతి సంఘం సహకారంతో అందజేశారు.

ఈ సందర్భంగా సాయన్న గౌడ్ మాట్లాడుతూ.. చదువు పేదరికానికి ఎప్పుడు అడ్డుకాకూడదని, విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో స్థిరపడి కులానికి, సమాజానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న, కౌండిన్య పరపతి సంఘం అధ్యక్షులు అంబాల సూర్యనారాయణ గౌడ్, గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొడిశాల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూదన్ గౌడ్, కేయూ పాలక మండలి సభ్యులు చిర్ర రాజు గౌడ్, వరంగల్ గోపా అధ్యక్షులు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ గౌడ్, కౌండిన్య పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి గట్టు సత్యనారాయణగౌడ్, సభ్యులు బత్తిని రమేష్ గౌడ్, కొండ నరేందర్, పెరుమాండ్ల అనిల్ గౌడ్, గట్టు ప్రభాకర్ గౌడ్, కంకటి సాగర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



సభలో అభివాదం చేస్తున్న ఆదివాసీ ఎరుకల సంఘం నేతలు

ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ.500కోట్ల బడ్జెట్ కేటాయించాలి

ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు

వడ్డెపల్లి, సెప్టెంబరు 29: ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ.500కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి సభలో ఆయన మాట్లాడారు. ఎరుకల నిరుద్యోగ యువతి, యువకులకు గ్రూప్-1, 2, 3, 4 ఉద్యోగాల భర్తీ కోసం హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేక ఏకలవ్య స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా 50 వేల కుటుంబాలు పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయని, పందులను షెడ్లలో పెంచుకోవడానికి ప్రతీ కుటుంబానికి రూ. 10 లక్షల వ్యక్తిగత రుణ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇల్లులేని పేద ఆదివాసీ ఎరుకల కుటుంబాలకు ఏకలవ్య కార్పొరేషన్ ద్వారా ప్రతీ జిల్లాకు 500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. ఎరుకల జాతి మూల పురుషుడు ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏకలవ్య కార్పొరేషన్ నిధుల నుంచి ట్యాంక్ బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ సభలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఓని సదానందం, జిల్లా నాయకులు పల్లకొండ ప్రభాకర్, పులిచేరు సారయ్య, భూనాద్రి రంజిత్, మానుపాటి సురేందర్, విజయేందర్, భిక్షపతి, సాంబశివ, శ్రీనివాస్, అంబి రాజు, మేనగుర్తి రఘు, పల్లకొండ రవి, మానుపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

రెండు మ్యాచ్‌లు గెలిచి ముందంజలో మహబూబ్‌నగర్ జట్టు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 29: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నగరంలోని వివిధ క్రీడా మైదానాల్లో నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్‌టోర్నీ పోటాపోటీగా కొనసాగుతున్నాయి. ఆదివారం కోమటిపల్లిలోని ఫోర్ట్ క్లబ్ క్రికెట్ మైదానంలో మహబూబ్‌నగర్ - నల్లగొండ జట్ల మధ్య జరిగిన పోరులో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నల్లగొండ జట్టుపై వరుసగా రెండుసార్లు విజయం సాధించడంతో లీగ్‌దశలో ముందుంజలో ఉంది. అదేవిధంగా పూల్ ఏలోని వరంగల్ - మెదక్ జట్ల మధ్య మొగిలిచర్ల క్రీడామైదానంలో పోటీలు నిర్వహించగా ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు మెదక్ జట్టుపై విజయం సాధించి చెరొక విజయాన్ని అందుకొని సమంగా పోటీలో ఉన్నాయి.

రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 8జట్లను ఎంపిక చేసి రెండు ఏ, బీ పూల్‌గా విభజించి అక్టోబరు 5వరకు పోటీలను నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. పూల్ ఏలో మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, మెదక్ జిల్లాలకు చెందిన 4జట్ల మధ్య ఈ నెల 30వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూల్ బీలోని ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లకు అక్టోబరు 1నుంచి 5వరకు పోటీలను నిర్వహిస్తామన్నారు. కాగా కోమటిపల్లి ఫోర్ట్‌క్లబ్ క్రికెట్ మైదానంలో మహబూబ్‌నగర్ - నల్లగొండ జట్ల మధ్య జరిగిన పోటీల్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. జట్టులోని ఓపెనర్ బ్యాట్స్‌మెన్ అబ్దుల్ రఫీ రెండు సిక్స్‌లు, 6ఫోర్ల సహాయంతో 71పరుగుల చేసి మహబూబ్‌నగర్ జట్టు గెలుపులో ముఖ్యభూమిక పోషించాడు. 187 పరుగుల లక్ష్యసాధనతో తదుపరి బ్యాటింగ్ బరిలోకి దిగిన నల్లగొండ జిల్లా జట్టు కేవలం 32ఓవర్లను ఎదుర్కొని 98పరుగులకే ఆలౌట్ కావడంతో మహబూబ్‌నగర్ జట్టు నల్లగొండ జట్టుపై 88పరుగుల తేడాతో రెండోసారి ఘన విజయం సాధించింది.

అదే విధంగా వరంగల్ - మెదక్ జట్ల మధ్య మొగిలిచర్ల క్రీడా మైదానంలో నిర్వహించిన పోరులో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు నిర్ణీత 50ఓవర్లగాను 49.2 ఓవర్లను ఎదుర్కొని 219పరుగుల చేసింది. 220భారీ పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు తదుపరి బ్యాటింగ్ బరిలోకి దిగిన మెదక్ జట్టు 29.4ఓవర్లను ఎదుర్కొని కేవలం 110పరుగుల వద్ద ఆలౌట్ కావడంతో వరంగల్ జట్టు మెదక్ జట్టుపై 109పరుగుల తేడాతో ఘన విజయాన్ని సాధించింది. వరంగల్ జిల్లా జట్టులోని ఆల్‌రౌండర్ వితీష్ 31పరుగులు చేసి 3వికెట్లను తీయగా ఇదే జట్టుకు చెందిన మరో ఆల్ రౌండర్ రిశ్వాంత్ 3వికెట్లను తీసి వరంగల్ జిల్లా జట్టు గెలుపులో కీలక భూమిక పోషించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఖాజా, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, బండారి ప్రభాకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




వరుసగా లీగ్‌లో రెండు మ్యాచ్‌లు గెలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో జిల్లా సభ్యులు

పూట గడవని స్థితిలో క్రీడా కుసుమం

అనారోగ్యంతో అంతర్జాతీయ వాలీబాల్ మాజీ కోచ్ అవస్థలు

వైద్య చికిత్స కోసం అష్టకష్టాలు.. తాత్కాలికంగా చేరదీసిన శిష్యుడు



ఆదుకోవాలని వేడుకుంటున్న భిక్షపతి

కేసముద్రం, సెప్టెంబరు 29 : అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసిన ఒకప్పటి వాలీబాల్ కోచ్ వృద్ధాప్యంతో ఆలనాపాలనా చూసేందుకు ఎవరూ లేక శిష్యుడి ఇంట్లో తలదాచుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి పేరు వినగానే వాలీబాల్ క్రీడ గుర్తొస్తుంది. ఆ క్రీడలో ఉమ్మడి వరంగల్ జిల్లానే కాకుండా రాష్ట్ర స్థాయిలో ఎక్కడ క్రీడాపోటీలు నిర్వహించినా ఈ గ్రామానికే ప్రథమస్థానం. స్పైకింగ్‌లో నైపుణ్యం, బూస్టింగ్‌లో చురుకుదనంతో మెరికల్లాంటి క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతారు. టెక్నికల్ ఆటను ప్రదర్శిస్తూ ఇట్టే ఆకట్టుకుంటారు. క్రీడాభిమానులు సైతం ఇనుగుర్తి టీం ఆటను ప్రత్యేకంగా, ఆసక్తిగా వీక్షిస్తారు. ఇక్కడి నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిరిగారు అలాంటి ప్రతిభావంతులు తయారవడం వెనుక దివంగత కందునూరి కొమురయ్యతోపాటు ఆయన సహాయకుడు సట్ల భిక్షపతి కృషి ఎంతో ఉంది. మెరికల్లాంటి ఆటగాళ్లను తయారు చేసిన కోచ్ ఇప్పుడు దీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. పూటగడవని దుస్థితిని ఎదుర్కొంటున్నాడు. ప్రభుత్వం చేయూతనివ్వాలని, ఆలనాపాలనా చూసుకునేందుకు వృద్ధాశ్రమంలో చేర్పించాలని వేడుకుంటున్నాడు.

కొమురయ్యకు సహాయకుడిగా..

ఇనుగుర్తి గ్రామంలో జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదిగి, ఉద్యోగాలు పొంది స్థిరపడిన క్రీడాకారులు 100 మందికిపైగా ఉన్నారు. అలాంటి క్రీడకు గ్రామంలో పునాది వేసింది దివంగత కందునూరి కొమురయ్య అయితే ఆయనకు సహచరుడిగా క్షేత్రస్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దింది కోచ్ సట్ల భిక్షపతి. 1973-1985 ప్రాంతంలో కోచ్‌గా కొనసాగి ఎంతోమందికి శిక్షణనిచ్చారు. అలాంటి కోచ్ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. 72 ఏళ్ల వయస్సున్న ఆయన గుండె, కిడ్నీ సంబంధించిన వ్యాధితో బాధపడుతూ చికిత్సపొందుతున్నారు. మరోవైపు షుగర్, బీపీ సైతం ఉన్నాయి. 1992లో క్యాన్సర్‌బారిన పడి చికిత్స తీసుకోగా నయమైంది. ఈ వ్యాధుల చికిత్స కోసం మందుల కొనుగోలు కోసం నెలకు రూ.15 వేలు ఖర్చవుతున్నాయి. సొంత ఇల్లు లేక ఒకప్పటి వాలీబాల్ శిష్యుడైన గంజి రాంమోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో తన ఇంట్లోనే ఆశ్రయమిచ్చి భోజనం పెడుతున్నాడు. ఆరోగ్యం సరిగాలేక వృద్ధాప్యంతో భిక్షపతి ఒకరి సహాయంతో కాలకృత్యాలు తీర్చుకోవడం ఆ తర్వాత ఎటూ వెళ్లలేని స్థితిలో మంచంలోనే ఉంటున్నాడు.

సరిపోని 'ఆసరా'..

ఆసరా పథకంలో భిక్షపతికి వృద్ధాప్యం పింఛను వస్తున్నప్పటికీ అవి ఏమూలకు సరిపోవడంలేదు. ఆయన శిక్షణలో క్రీడాకారులుగా ఎదిగి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు స్పందించి 2021లో రూ.70వేలు ఆర్థిక సహా యాన్ని అందించారు. అవి కూడా వైద్య చికిత్సలకు అప్పుడే అయిపోయాయి. జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారు లను అందించిన కోచ్‌కు ప్రభుత్వం నుంచి సహాయం అందకపోవడంతో గ్రామస్తులు సైతం విచారం వ్యక్తం చేస్తు న్నారు. పైగా తెలంగాణ ఉద్యమంలో భిక్షపతి క్రియాశీ లకంగా పాల్గొన్నాడు. అలాంటి ఆయనను చూసుకునేం దుకు ఎవరూ లేక తాత్కాలికంగా శిష్యుని ఇంట్లో తల దాచుకొని పూటగడుపుతున్నాడు. ప్రస్తుతం తాను భిక్షాటన చేసే పరిస్థితి ఏర్పడిందని ఆత్మాభిమానం అడ్డువచ్చి ఆగా నని బోరుమని విలపిస్తూ భిక్షపతి చెబుతుండడం ఆయన దయనీయ స్థితికి అద్దం పడుతోంది. తనకు ప్రతీనెల మందులను అందజేసి తనను వృద్ధాశ్రమంలో చేర్పించాలని భిక్షపతి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు సహాయం చేసే వారు తనను చేరదీసిన శిష్యుడు గంజి రాంమోహన్‌రెడ్డి సెల్ నెంబర్ 97052 69535లో సంప్రదించాలని కోరారు. ఎవరైనా దయార్థహృదయులు, క్రీడాభిమానులు స్పందించి ఇనుగుర్తి ఐఓబీలోని ఐఎఫ్ఎస్‌సీ : ఐఓబీఏ0000920లోని తన ఖాతా నెంబర్ 092001000002553కు ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఇనుగుర్తిలోని తన ఇంట్లో వాలీబాల్ మాజీ కోచ్ భిక్షపతికి భోజనం పెడుతున్న శిష్యుడు రాంమోహన్‌రెడ్డి

కాళేశ్వరంలో కలెక్టర్ దంపతుల పూజలు



కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ అధికారి

మహదేవపూర్, సెప్టెంబరు 29: మండలంలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రంలో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం గోపురం ముందు మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలతో పూర్ణకుంభస్వాగతం ద్వారా కలెక్టర్ దంపతులను వేదపండితులు, అధికారులు స్వాగతం పలికారు. కాళేశ్వరముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న కలెక్టర్ దంపతులు మహారుద్రాభిషేకంతో పాటు పలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శుభానందాదేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు పట్టు వస్త్రంతో కలెక్టర్ దంపతులను సన్మానించారు.

మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను నియమించాలి

మహదేవపూర్, సెప్టెంబరు 29 : మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ జాతీయ అధ్యక్షుడు అయిలినేని శ్రీనివాసరావు కోరారు. మహదేవపూర్ మండల ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను నయమించి రాజ్యాంగ హక్కులను కాపాడాలన్నారు. మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టాలన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర సభ్యులు జి.గంగా ప్రసాద్, ఎన్.గంగారాం, పెద్దపల్లి జిల్లా చైర్మన్ మాచిడి దిలీప్, జిల్లా సెక్రటరీ కృష్ణ మూర్తి, ఆలిండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు లింగాల రామయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మెరుగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా ఫణీందర్

రాంనగర్, సెప్టెంబరు 29: వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా డి.ఫణీందర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో రిజిస్ట్రేషన్ శాఖలో జరిగిన బదిలీల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బదిలీల ప్రక్రియను సమీక్షించి పలువురిని బదిలీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పలువురు రిజిస్ట్రార్లను శనివారం బదిలీ చేశారు. ఖమ్మం నుంచి బదిలీపై వచ్చి వరంగల్ ఆడిట్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న ఫణీందర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు.

అవస్థల ఆర్టీసీ

- భూపాపల్లి డిపోలో సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు
- ఉన్నవారిపైనే అధిక పనిభారం
- డబుల్ డ్యూటీలు చేయలేక సిక్ అవుతున్న డ్రైవర్లు



కాకతీయఖని, సెప్టెంబరు 29: భూపాలపల్లి ఆర్టీసీ డిపోను కొంత కాలంగా ఉద్యోగుల కొరత వేధిస్తోంది. దీంతో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులపై అధిక పనిభారం పడుతోంది. కొందరు డ్రైవర్లు, కండక్టర్లు డబుల్ డ్యూటీలు చేయలేక అనారోగ్య కారణంతో సెలవులు తీసుకున్నట్టు సమాచారం. వరంగల్ రీజియన్‌లోనే నంబర్ వన్ స్థానంలో ఉన్న భూపాలపల్లి ఆర్టీసీ డిపో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని తెలుస్తోంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2013 నవంబర్‌లో ఆర్టీసీ డిపో తొమ్మి బస్సులతో ప్రారంభమైంది. ప్రస్తుతం 83 బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. వీటిలో సంస్థకు చెందిన 59 బస్సులు (ఆర్టీసీ), 24 అద్దె (షైర్) బస్సులు ఉన్నాయి. ఇవి రోజుకు సుమారు 35వేల కిలో మీటర్లు తిరుగుతూ... సుమారు 36వేల మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. దీంతో సగటున రోజుకు సంస్థకు సుమారు రూ. 20లక్షల ఆదాయం వస్తుందని ఆర్టీసీ ఉద్యోగుల చెబుతున్నారు. అయితే.. ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చేందుకు సరైన సిబ్బంది లేక ఉద్యోగులు సతమతమవుతున్నారు. ఈ డిపోలో 146 మంది డ్రైవర్లు, 160 మంది కండక్టర్లు పనిచేయాల్సి ఉంది. ప్రస్తుతం 126 మంది డ్రైవర్లు మాత్రమే పనిచేస్తున్నట్లు సమాచారం. వీరిలో మెడికల్ అన్‌ఫిట్ అయి ఉన్న వారు ఐదుగురు (ఫైనల్ ఆర్డర్ కోసం ఎదురు చూస్తున్న వారు), సస్పెన్షన్‌లో ఉన్న వారు ఇద్దరు, ఫైర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న డ్రైవర్లు ముగ్గురు, వేరే డిపోల్లో విధులు నిర్వరిస్తున్న వారు మరో ఇద్దరు ఉన్నట్టు తెలుస్తోంది. ఏడుగురు సిక్‌లో ఉన్నారని, ఆరుగురు డ్రైవర్లకు ఇటీవల ట్రాన్స్‌ఫర్ అయ్యారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా 160 మంది కండక్టర్లు పనిచేయాల్సిన డిపోలో ప్రస్తుతం 146 మంది విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇందులో ఎనిమిది మంది ఇతర డ్యూటీస్ చేస్తుండగా, ముగ్గురు సస్పెండ్ అయినట్లు తెలిసింది. అలాగే ఎనిమిది మంది సిక్‌లో ఉండగా నలుగురు లాంగ్ లీవ్‌లో ఉన్నట్లు సమాచారం. అయితే 25 మంది డ్రైవర్లు, 23 మంది కండక్టర్లు వివిధ సమస్యలు, పనుల్లో వెళ్లగా మిగిలిన 101 మంది డ్రైవర్లు, 123 మంది కండక్టర్లు డ్యూటీలు చేయాల్సి వస్తుండటంతో పని ఒత్తిడి పెరుగుతోందని ఆవేదన వ్యక్తవుతోంది. .

డబుల్ డ్యూటీలు చేయలేక..

భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో ఉన్న కొద్ది మంది ఉద్యోగులతో అధికారులు బస్సులను నడిపిస్తున్నారు. కొందరు డ్రైవర్లు, కండక్టర్లు ఏదో ఒక సమస్యతో సెలవులు పెడుతుండడంతో ఉన్న వారికి అధికారులు డబుల్ డ్యూటీలు వేస్తున్నారు. దీంతో రెస్ట్ లేకుండా డ్యూటీలు చేస్తుండటంతో అలసి పోతున్నామని, ఈ క్రమంలో రోగాల బారిన పడి సిక్ లీవ్ పెట్టాల్సి వస్తోందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెస్ట్ లేకుండా బస్సులు నడుపుతుం డటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. అయితే తమకు కేటాయించి డ్యూటీలు చేసుకుంటూ పోతే పని ఒత్తిడి ఉండదని, రెస్ట్ దొరుకుతుందని, దీంతో ఆరోగ్యంగా ఉంటామని, తద్వారా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడొచ్చని సిబ్బంది చెబుతున్నారు.

పెద్ద దిక్కు లేక...

భూపాలపల్లి డిపోకు కొంత కాలంగా పెద్ద దిక్కు లేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ లాంగ్ లీవ్‌పెట్టి వెళ్లారు. దీంతో పరకాల డిపో మేనేజర్ రవిచంద్రను ఇన్‌చార్జిగా నియమించారు. రెండు సంవత్సరాలుగా డిపోకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్(టీఐ), మెకానికల్ ఫోర్‌మన్ (ఎంఎఫ్), ఎస్టీఐలు లేకుండానే డిపోను నడిపిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఏడీసీలు 17 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 12 మంది పనిచేస్తున్నారు. 146 మంది డ్రైవర్లు, 160 మంది కండక్టర్లు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 126 మంది డ్రైవర్లు, 146 మంది కండక్టర్లు ఉన్నారని, వీరిలో 101 మంది డ్రైవర్లు, 123 మంది కండక్టర్లు రెగ్యులర్‌గా డ్యూటీలు చేస్తున్నట్లు సమాచారం. డిపోలో సిబ్బంది తక్కువ ఉండడంతో ఉన్నవారిపై పని భారం పడుతోంది. లాభాల బాటలో పయనిస్తున్న భూపాలపల్లి ఆర్టీసీ డిపోపై ప్రభుత్వం, యాజమాన్యం దృష్టి సారించి సిబ్బందిని నియమించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఫారెస్ట్ ఉద్యోగిపై దాడి అమానుషం: తుడుందెబ్బ

మంగపేట, సెప్టెంబరు 29: ఆదివాసీ ఫారెస్ట్ ఉద్యోగిపై దాడి అమానుషమని, దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తుడుందెబ్బ మంగపేట మండల కమిటీ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘం అత్యవసర సమావేశంలో మండల అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు మాట్లాడుతూ ఈనెల 26న అర్ధరాత్రి తాడ్వాయి రేంజీలో దామెరవాయి అటవీ ప్రాంతంలో విధి నిర్వహణలో భాగంగా ఎక్స్‌కావేటర్ స్వాధీనం చేసుకొని తాడ్వాయి అటవీ శాఖ కార్యాలయానికి తరలించే సమయంలో ఫారెస్టు అధికారిపై దుండగులు దాడి చేసి హతమార్చేందుకు యత్నించారని అన్నారు. ఎఫ్ఎస్వో వినోద్, ఎఫ్‌బీవో శరత్‌ను గాయపర్చిన పాల్పడ్డ దుండగులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.

పోలీసుల తనిఖీలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో మావోయిస్టుల ఆవిర్భావ వారోత్సవాలను పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితులను విచారించి వదిలేశారు.ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీనుబాబు

మహాముత్తారం, సెప్టెంబరు29: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగమల్ల దుర్గయ్య తల్లి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన్ను, ఆయన కుటుంబాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు ఆదివారం పరామర్శించారు. సమ్మక్క చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు కిష్టయ్య, మాజీ జడ్పీటీసీలు శారద, సమ్మయ్య, నాయకులు ముక్కెర రాజమల్లుగౌడ్, రాంనారయణగౌడ్, మోత్కూరి రవి, నజీర్‌ఖాన్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

అలాగే మూడు రోజుల క్రితం ఫారెస్టు అధికారుల దాడిలో గాయపడ్డ మండల కేంద్రానికి చెందిన బాధితులు శ్రీనుబాబును కలిశారు. వంట చెరుకు కోసం వెళ్లిన తమను ఫారెస్టు అధికారులు దారుణంగా కొట్టారని తెలిపారు. తమపై దాడి చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి కోరారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ ఈ సమస్యను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు
సెమీ డీలక్స్ ఆర్టీసీ సర్వీసులు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 29: హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి ములుగు మీదుగా ఏటూరునాగారం వరకు సెమీ డీలక్స్ బస్సు సర్వీసులు ప్రారంభించినట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ములుగు జిల్లా ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 7.30, 8.45 గంటలకు, మధ్యాహ్నం 1.20, 2.15 గంటలకు హనుమకొండ నుంచి ములుగు మీదుగా ఏటూరునాగారం వరకు సెమీ డీలక్స్ బస్సు సర్వీసులు బయల్దేరుతాయని పేర్కొన్నారు.

కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 29: బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం ములుగు మండలంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ములుగు మండలంలోని పత్తిపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ప్రారంభించారు. కార్యకర్తలకు పార్టీ సభ్యత్వాలను అందజేసి మాట్లాడారు. బీజేపీ కుటుంబంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శీలమంతుల రవీంద్రచారి, భూక్య రాజునాయక్, అడప భిక్షపతి, గంగిశెట్టి రాజ్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి
ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్



మాట్లాడుతున్న జంపాల రవీందర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 29: కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీం దర్ డిమాండ్ చేశారు. ములు గులో ఆదివారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్స రాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను ఏర్పాటుచేసి చట్టాలను కుదించడం సరికాదని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంతోపాటు ఉద్యోగభద్రత కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, నాయకులు ముత్యాల రాజు, జక్కుల ఐలయ్య, మాతంగి శ్యాంసుందర్, వడి సారయ్య పాల్గొన్నారు.

శిల్ప సంపదను భావి తరాలకు అందించాలి

గణపురం, సెప్టెంబరు 29: కాకతీయుల శిల్ప సంపదను భావితరాలకు అందించాలని పరకాల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శాలిని లింగం అన్నారు. ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగరాజు సాదరంగా ఆహ్వానించగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి సారిగా ఆలయాన్ని సందర్శించానన్నారు. ఆలయ నిర్మాణం ఎంతో విశాలంగా ఉందన్నారు. కోటగుళ్ల ఆలయం రామప్పను పోలిన విధంగా అద్భుతంగా ఉందని ఉందని అన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా లక్ష్మణ్



చిట్యాల, సెప్టెంబరు 29: చిట్యాల మండల కేంద్రం గౌడ సంఘం అధ్యక్షుడిగా బుర్ర లక్ష్మణ్ ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలను తలపించేలా నాలుగు రోజుల పాటు గ్రామంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఈమేరకు ఆదివారం స్థానిక ఎల్లమ్మతల్లి ఆలయం ఆవరణలో ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా పెరుమాండ్ల రాజు, డైరెక్టర్లుగా బుర్ర రాజ్‌కుమార్, ఆముదాలపెల్లి శ్రీనివాస్, గుర్రపు రాజేందర్, బుర్ర నరేష్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మధు

కాటారం, సెప్టెంబరు 29: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పర్యటించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గుమ్మళ్లపల్లి, కొత్తపల్లి, గారెపల్లి, మద్దులపల్లి గ్రామాల్లో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన తడండ్ల పోచయ్య, కొలుగూరి రాజయ్య, పాగె మల్లయ్య, తైనేని మల్లయ్య, గడ్డం మల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కంకణాల రాజిరెడ్డిని పరామర్శించి ఆరోగ్యపరిస్థితి తెలుసు కున్నారు. విలేకరి పెండ్యాల రంజిత్ తండ్రి ఆనందం ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల ఇంచార్జి జోడు శ్రీనివాస్, యూత్ రాష్ట్ర నేత జక్కు రాకేష్, నాయకులు నరివెద్ది శ్రీనివాస్, కొండగొర్ల వెంకటస్వామి, జక్కు శ్రావణ్, దుర్గారావు, శేఖర్, సమ్మయ్య, బాలరాజు, రమేష్‌రెడ్డి, మానెం రాజబాపు, కిష్టయ్య, స్వామి, రాజ్‌కుమార్, రజాకర్, కూర దేవేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా దేవేందర్



రేగొండ, సెప్టెంబరు 29: సీపీఎం మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా భిక్షపతి, మండల కమిటీ సభ్యులుగా శంకర్, కుమారస్వామి, యాదిరెడ్డి, లక్ష్మి, మంజులను ఎన్నుకున్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



ఫెర్రీపాయింట్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 29 : గ్రామాల్లోకి వచ్చే అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారెవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. పలిమెల మండలంలోని ముకునూర్ గొత్తికోయగూడెంలో ఆదివారం నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో మహదేవపూర్ సీఐ రాంచదర్‌రావుతో కలిసి డీఎస్పీ పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గూడెం నుంచి ఎవరైనా వెళ్లిపోయినా, కొత్తగా ఎవరైనా వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గూడెంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తామని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం గోదావరి పరీవాహక ప్రాంతంలోని వెంచంపల్లి, బూర్గుగూడెం ఫెర్రీపాయింట్లను డీఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట పలిమెల, గణపురం ఎస్సైలు తమాషారెడ్డి, అశోక్, ఆర్ఎస్సై ఫిరోజ్, స్పెషల్ పార్టీ, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

అడవి పందులతో పంటలు ధ్వంసం

కాటారం, సెప్టెంబరు 29: అటవీ ప్రాంతం దగ్గరగా ఉన్న గ్రామాల శివారులోని పంటలతో పాటు మైదాన ప్రాంతాల్లోని పొలాలు, పత్తి చేన్లను అడవిపందులు ధ్వంసం చేసున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి మండలంలోని రేగులగూడెం, దేవరాంపల్లి, గోపాల్‌పూర్, భూడిదపల్లి, గంగారం గ్రామాల పరిధిలోని రవి, రాజేందర్, సమ్మయ్య, గట్టయ్య, బాపు, భాస్కర్, తిరుపతి, మహేష్, పోచం, వెంకటస్వామి, రాజయ్య, సడువలి తదితర రైతులకు చెందిన వరి పొలాలు, పత్తిచేలను అడవి పందులు ధ్వంసం చేశాయి. పందులు గుంపులుగా వచ్చి పాలు పోసుకునే దశలో ఉన్న వరి వెన్నులను తొక్కడంతో నష్టం వాటిల్లుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా నల్లెల కుమారస్వామి జయంతి



ములుగులో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 29: కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లెల కుమారస్వామి జయంతి వేడుకలు ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య ములుగులోని చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అదేవిధంగా ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, అన్నదానం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

● తాడ్వాయి: నల్లెల కుమారస్వామి జయంతి సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం ట్రస్టుబోర్డు చైర్మన్ అరెం లచ్చుపటేల్, నాయకులు పాక సాంబయ్య, ఎమ్డీ.ముజాఫర్ హుస్సేన్, ఇర్స సునీల్, నాగేశ్వర్‌రావు, బెజ్జూరి శ్రీనివాస్, యానాల ఆదిరెడ్డి, రంగరబోయిన జగన్, భూషబోయిన రవికుమార్, పాక రాజేందర్, అనుమాండ్ల రాజిరెడ్డి, గంట సాయిరెడ్డి, ఆలేటి జయపాల్‌రెడ్డి, నునావత్ శ్రీను పాల్గొన్నారు.

● మంగపేట : నల్లెల కుమారస్వామి జయంతి వేడుకలు మండలంలో జరిగాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పలు పాఠశాలలు, పీహెచ్‌సీల్లో పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. పార్టీ జిల్లా నాయకులు, అనుబంధ సంఘాలు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం: నల్లెల కుమారస్వామి జయంతి వేడుకలనుమండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న హాజరయ్యారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్‌ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మాజీ వార్డు మెంబర్ కె. రంజిత్, ఈసం నర్సయ్య, టౌన్ అధ్యక్షుడు సరికొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి బ్లడ్‌డోనర్స్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బ్లడ్ డోనర్స్

ఏటూరునాగారం, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని ఆకుల వారిఘణపురానికి చెందిన శీలం రేణుక అనే చిన్నారి కొన్ని రోజుల క్రితం విషజ్వరంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం పరామర్శించారు. సంఘం మండల అధ్యక్షుడు సయ్యద్ వహీద్ చేతుల మీదుగా రూ. 25 వేల ఆర్థిక సాయం అందించారు. నిరుపేదలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరీశ్, సతీష్, పవన్, సుఖేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్య కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 29: భూపాలపల్లి పట్టణంలోని ముత్య కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 300 మందికిపైగా ప్రజలకు మూత్రపిండాలు, షుగర్, లిక్విడ్ ప్రొఫైల్, హిమోగ్లోబిన్, సీబీసీ, హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వహకులు డాక్టర్ చందుకృష్ణ మాట్లాడుతూ అత్యధిక ప్రజలు మూత్రపిండాల సమస్యలు, షుగర్ తదితర వ్యాధుల బారినపడుతున్నారన్నారు. కిడ్నీ, షుగర్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హెల్త్ క్యాంపు నిర్వహించామని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2,200 విలువగల పరీక్షలను పరీక్షలు చేశామన్నారు. మందుల కొనుగోలుపై 20 శాతం రాయితీ కూడా ఇచ్చామన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు పాపయ్య నిర్మల్ పూదోట, మాచర్ల సందీప్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు